


ఏఐటీటీ పరీక్ష రాసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 : జిల్లాలో ఐటీఐకి సంబంధించి ఏదైనా ట్రేడ్‌లలో అనుభవం ఉన్న అభ్యర్థులు ట్రేడ్ పరీక్షలకు (ఏఐటీటీ) హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వి.రాధాకృష్ణ మంగళవా రం ఒక ప్రకటనలో సూచించారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఐటీఐలో 1 మరి యు 2 సంవత్సరాల కోర్సులకు ఏదైనా ట్రేడ్‌కు సంబంధించిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు వరంగల్ ములుగు రోడ్డులోని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో అందజేయాలని ప్రిన్సిపాల్ సూచించారు.

రాములోరి కల్యాణం

నేడు శ్రీరామనవమి



- మిథిలా నగరి ముస్తాబు
- 66వ సీతారామ కల్యాణోత్సవం
- షామియానాలతో పట్టణంలోని గాంధీపార్కు సిద్ధం
- జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి
- మానుకోటలోని వేడుకలకు హాజరుకానున్న ప్రభుత్వ సలహాదారు వేం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 : శ్రీరామ నవమిని పురస్కరించుకుని జిల్లాలోని దేవాలయాలు ముస్తాబయ్యాయి. శ్రీసీతారాముల కల్యాణాన్ని బుధవారం కన్నుల పండువగా జరిపించేందుకు శ్రీసీతారామ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలోని అన్ని మండలకేంద్రాలు, గ్రామాల్లో గుళ్లలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలంకరించడంతో మిరిమిట్లు గొలుపుతున్నాయి. దీంతో గ్రామాలు, పట్టణాల్లో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామాల్లోని కల్యాణోత్సవ వేడుకల వద్ద భక్తులకు ఎండవేడిమి తగులకుండా చలువ పందిళ్లు, షామీయానాలను ఏర్పాటు చేశారు. పురాణ పురుషుడిగా పేరొందిన జగదభిరాముడి కల్యాణమంటేనే ఆధ్యాత్మిక ప్రపంచానికి భద్రాద్రిలో అంగరంగవైభవంగా జరిగే శ్రీసీతారాములు కల్యాణం మొదట గుర్తుకు వస్తోంది. ఆ స్థాయిలో లేకున్నా.. దాదాపు ఆరు దశాబ్దాలుగా ఒకప్పటి గ్రామాల సమూహంతో ఏర్పడిన మానుకోట కేంద్రంగా సీతారాముల కల్యాణోత్సవం మినీభద్రాద్రిని తలపించేలా నిర్వహిస్తూవస్తున్నారు. ఒకప్పటి మారుమూల మానుకోట క్రమంగా మునిసిపల్, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రాల ప్రాధాన్యతను సంతరించుకొని మహబూబాబాద్ జిల్లా కేంద్రంగా అసాధారణ అభివృద్ధిని తన సొంతం చేసుకుంది. పల్లెనుంచి ఢిల్లీ వరకు ఎక్కడికక్కడే ఆయా ప్రాంతాల స్థాయి మేరకు శ్రీరామనవమి ఉత్సవాలు జరుగుతూ రావడం అనవాయితీ. ఇక్కడ మహబూబాబాద్‌లోను 66 సీతారామ కల్యాణ ఉత్సవాలు నిరాటంకంగా పూర్తయ్యాయి.

మిథిలా నగరంలో భారీ ఏర్పాట్లు..



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, ఆలయ కమిటీ

మహబూబాబాద్ పట్టణంలోని గాంధీపార్క్ (మిథిలా నగరం) నుంచి శ్రీరామాలయం వరకు ప్రధాన రహదారిపై నేడు నిర్వహించే శ్రీసీతారామకల్యాణ ఉత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. బుధవారం స్వస్తిశ్రీ శ్రీక్రోధి నామ సంవత్సరం చైత్రశుద్ధ నవమి నాడు మధ్యాహ్నం 12.05 నిమిషాలకు పునర్వసున క్షత్రయుక్త కర్కాటక, లగ్నపుష్కరాంశ శుభ ముహూర్తాన మిథిలానగర చక్రవర్తులు శ్రీజనకమహారాజు పుత్రిక చిరంజీవి లక్ష్మీసౌభాగ్యవతి సీతాదేవిని కోసల రాజ్యసార్వభౌములు శ్రీదశరథ మహారాజుగారి ప్రథమ పుత్రుడు చిరంజీవి శ్రీరామచంద్రునకు ఇచ్చి కల్యాణం నిర్వహించేందుకు ఆహ్వాన పత్రాలు కూడా భక్తులకు పంపిణీ చేశారు. ఈ ఉత్సవ నిర్వహణ కోసం గాంధీపార్కును మిథిలానగరంగా విద్యుత్‌కాంతులతో మిరిమిట్లు కొలిపే విధంగా ఆలంకరించారు. భక్తులకు ఎండవేడి నుంచి ఉపశమనం పొందేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న ఏర్పాట్లను పరిశీలించారు.

1959 రైల్వే స్టేషన్ నుంచి..

మహబూబాబాద్‌లో ప్రప్రథమంగా 1959 సంవత్సరంలో రైల్వేస్టేషన్ వారి ఆధ్వర్యంలో శ్రీసీతారామ కల్యాణోత్సవాలు ఆరంభమై దాదాపు ఒక దశాబ్ద కాలం పాటు ఇదే ఆనవాయితీని నిలుపుకుంటూ వచ్చాయి. 1970 సంవత్సరంలో శ్రీరామ మందిరంలో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసి ఇప్పటి వరకు నిర్వహిస్తూ వస్తున్నారు. కాగా, 1983వ సంవత్సరంలో రామమందిరం దేవాదాయ శాఖ ఆధీనంలోకి వచ్చింది. 66 ఏళ్ల ఉత్సవాల్లో 53 సంవత్సరాలుగా ప్రోగ్రాం కన్వీనర్ దివంగత వూరె రామకోటేశ్వర్‌రావు నిర్వహించారు. తదనంతరం ఆయన తనయుడు వూరె గురునాథరావు ఆ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1959లో అప్పటి స్టేషన్ మాస్టర్ స్వామి నిర్వాహకుడిగా నవమి ఉత్సవాల విజయవంతానికి కృషి చేశారు.

హాజరుకానున్న ప్రముఖులు..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీరామాలయంలో నిర్వహించనున్న శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హాజరుకానున్నారు. ఇప్పటికే స్థానిక శాసనసభ్యులు భూక్య మురళీనాయక్, మానుకోట పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, కల్యాణోత్సవ కమిటీ బాధ్యులు హైదరాబాద్‌లో వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.



రాములోరి కల్యాణోత్సవానికి ముస్తాబైన వేదిక, వేడుకలను వీక్షించేందుకు భక్తులకు ఏర్పాటు చేసిన షామియానాలు

కల్యాణం చూతము రారండి

- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్

జగదభి రాముడి కల్యాణోత్సవాన్ని చూడడానికి మహబూబాబాద్ పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలిరావాలని స్థానిక శాసనసభ్యుడు భూక్య మురళీనాయక్ కోరారు. గాంధీపార్కులో కల్యాణోత్సవ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ షామియానాలు వేసి ఫ్యాన్లు, కూలర్‌లు ఏర్పాటు చేశామని, నీటి వసతితో పాటు మజ్జిగ, వడపప్పు, బెల్లంపానకం, పులిహోర, ప్రసాదం అందజేస్తామని చెప్పారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు జిన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి యుక్కల ఉదయ్‌చందర్, కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, ఉత్సవ కమిటీ నిర్వాహకులు చౌడవరపు మోహన్‌రావు, ఓం నారాయణ లోయ, పుప్పాల రమేష్‌బాబు, ఎడ్ల రమేష్, నాయకులు నాళ్ల నరసింహారవు, సుదర్శన్, మునిసిపల్ కోప్షన్ నిమ్మల శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అన్నివిధాల అభివృద్ధి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న యశస్వినిరెడ్డి

తొర్రూరు, ఏప్రిల్ 16 : కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని దేవరుప్పల మండలానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు 50 మంది ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి ఆమె కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజల సంక్షేమం కోసం మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశ పెడతారని తెలిపారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే 5గ్యారంటీలు అమలవుతున్నాయని, వాటితో పాటు రుణమాఫీ, మద్దతు ధర, పింఛన్లు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో దేవరుప్పల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు అండగా ఉంటాం

జీరో బడ్జెట్‌తో తెరకెక్కించే సినిమా కళాకారులకు అండగా ఉంటామని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఈనెల 19న జీరో బడ్జెట్‌తో విడుదల కానున్న 'శరపంజరం' సినిమా హీరో గట్టు నవీన్‌కుమార్ బృందం మంగళవారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో వారిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరపంజరం సినిమా ప్రివ్యూ చూడటం జరిగిందని, తెలంగాణ పల్లెల్లో జోగినీ వ్యవస్థను కళ్లకు కట్టినట్లుగా చూపించారని తెలిపారు. దర్శకుడు, హీరో, హీరోయిన్, కెమెరా మెన్, నటీనటులు నియోజకవర్గానికి చెందిన వారే కావడం అభినందనీయం అన్నారు. ప్రజలందరూ సినిమా చూసి వారిని ఆదరించాలని కోరారు. సినిమా దర్శకుడు, హీరో నవీన్‌కుమార్, కెమెరామెన్ మస్తాన్, మెరుగు మల్లేషం, యూనిట్ సభ్యులు ఉన్నారు.



మెరుగు కౌశిక్ (ర్యాంకు 82) | జయసింహారెడ్డి (ర్యాంకు 103) | ప్రణయ్ కుమార్ (ర్యాంకు 554) | సైంపు కిరణ్‌కుమార్ (ర్యాంకు 568) | కోటే అనిల్‌కుమార్ (ర్యాంకు 743)

మనోళ్లు మెరిశారు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదుగురికి సివిల్స్‌లో ర్యాంకులు



యునైటెడ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా రత్నాలు మెరిశారు. ఐదుగురు ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తాచాటారు. హనుమకొండలోని విద్యుత్ నగర్‌కు చెందిన రావుల జయసింహారెడ్డి 103వ ర్యాంకు సాధించగా, గీసుగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సైంపు కిరణ్‌కుమార్ 568వ ర్యాంకు సాధించారు. వరంగల్ నగరంలోని శివనగర్‌కు చెందిన కోటే అనిల్‌కుమార్ 743వ ర్యాంకు సాధించారు. అలాగే జనగామ జిల్లా జనగామ పట్టణానికి చెందినమెరుగు కౌశిక్ 82, జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రణయ్ కుమార్ 554వ ర్యాంకు సాధించి సత్తాచాటారు.

7 లో..

- వరంగల్ ఎడ్యుకేషన్/గీసుగొండ/జనగామ కల్చరల్/రఘునాథపల్లి

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతున్న సీఎం

- 19న మానుకోటకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి..
- ఎంపీగా బలరాంనాయక్ నామినేషన్‌కు హాజరు.. బహిరంగ సభలో ప్రసంగం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ప్రజలు కోరుకున్న ప్రభుత్వం వచ్చిందని, వారి ఆశలు నేరవేర్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. మహబూబాబాద్ డీసీసీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనతికాలంలోనే దేశంలోనే రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేలా ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. రైతులకు బీమా పథకాన్ని లేకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తే.. కాంగ్రెస్ సర్కారు అన్నదాతలను ఆదుకోవడానికి బీమా పథకాన్ని తీసుకు వస్తున్నదని అన్నారు. అదికూడా రైతుల పక్షాన రూ.3 వేలకోట్ల ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేలా ప్రణాళికలుసిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం జరిగితే బీమా చెల్లించడం ద్వారా పరిహారం వస్తుందని చెప్పారు.

ముఖ్యమంత్రి సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి..

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈనెల 19న మహబూబాబాద్ జిల్లాకు రానున్నారని తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ నామినేషన్‌కు సీఎం హాజరుకానున్నారని, తర్వాత పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తారని చెప్పారు. శుక్రవారం జరిగే సీఎం సభకు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో సభాస్థలిని పరిశీలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వర్‌రావు

ఆగస్టు 15 లోగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసేందుకు రంగం సిద్ధమైందని, అందుకు ఆర్బీఐతో చర్చలు జరుగుతున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు సెప్టెంబర్ 17న రాజీవ్ ప్రాంగణంలో సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా చేస్తూ వస్తోందని ఆయన తెలిపారు.

వ్యవస్థలు, వనరులను విధ్వంసం చేసిన బీఆర్ఎస్..

గత బీఆర్ఎస్ పాలకులు రాష్ట్రంలో వ్యవస్థలను, వనరులను విధ్వంసం చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆరోపించారు. నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో నీళ్ల ఖాళీ చేయడం, ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాపాలన చేస్తుందని, మళ్లీ తామే అధికారంలోకి రావాలన్న కుట్రలతో ఇవన్నీ చేశారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి వాటన్నింటిని అధిగమించి ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేరుస్తూ సుపరిపాలనను అందిస్తున్నారని తెలిపారు. గత పాలకులు ఎన్నికల సమయంలో హామీలు

మిగతా 8వ పేజీలో

నామినేషన్ల ప్రక్రియకు పార్టీలు సహకరించాలి

- రేపటి నుంచి ఎంపీ అభ్యర్థుల దరఖాస్తులు స్వీకరిస్తాం
- ఉదయం 11 నుంచి 3 గంటల వరకు పత్రాలు తీసుకుంటాం
- కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ కోరారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నామినేషన్ల ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ తేదీ నుంచి 25 వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని, ఈ ప్రక్రియ ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందన్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందని వెల్లడించారు. నామినేషన్లను కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు, వారితో పాటు అనుమతించే వ్యక్తులు వాహనాలు, తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. పోటీచేసే అభ్యర్థి పేరిట ఏదైనా జాతీయ బ్యాంకులో ఎన్నికల వ్యయం కోసం కొత్త ఖాతాను తెరవాలని చెప్పారు. నామినేషన్ల సందర్భంగా ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు రూ.12,500, జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజకీయ పార్టీలప్రతినిధులకు అవగాహన కల్పించారు. నామినేషన్ల ప్రక్రియ అనంతరం అభ్యర్థుల జాబితా ఖరారు తర్వాత ఎన్నికల ఖర్చుల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాల్సిన నిబంధనలు వివరంగా కలక్టర్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు రూ.90 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఎన్నికల పర్యవేక్షణ అధికారి పవన్‌కుమార్ రాజకీయ పార్టీలప్రతినిధులు మార్నేని వెంకన్న, ఎన్.సురేష్‌నాయుడు, కోమల్‌రెడ్డి పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి



కేసముద్రం, ఏప్రిల్ 16 : మండలంలోని కల్వల గ్రామంలో పశువులకు గడ్డి కోసేందుకు మంగళవారం వెళ్లి, వడదెబ్బ తగలడంతో కుదురుపాక అబ్బయ్య (65) మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం. అబ్బయ్య పశువుల మేత కోసం గడ్డికోసేందుకు తన చెల్కా వద్దకు వెళ్లాడు. ఎండతీవ్రత తాళలేక చేను వద్దనే సొమ్మసిల్లి పడిపోయాడు. ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో కొంతసేపటి వరకు ఆయన్ను ఎవరూ గుర్తించలేదు. అటుగా వెళ్లిన ఓ వ్యక్తి అబ్బయ్య పడిపోయిన విషయాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు బైక్‌పై అబ్బయ్యను ఇంటికి తీసుకువచ్చి 108కు ఫోన్ చేశారు. ఆ సిబ్బంది వచ్చిచూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

20న జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ ఎంపికలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్16 : మానుకోట పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల బాస్కెట్ బాల్ క్రీడా మైదానంలో ఈనెల 20న జూనియర్ బాలబాలికలకు జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ముల్లంగి ప్రతాప్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2006 తర్వాత జన్మించినవారై ఉండాలని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణపత్రం వెంట తీసుకురావాలన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25వ తేదీ నుంచి 27 వరకు హైదరాబాద్‌లో జరిగే 8వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

మార్కెట్‌ను తనిఖీ చేసిన అడిషనల్ డైరెక్టర్

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 16 : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను మంగళవారం హైదరాబాద్ మార్కెటింగ్‌శాఖ అడిషనల్ డైరెక్టర్ రవి కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మార్కెట్ యార్డులో తిరుగుతూ.. రైతులకు కల్పిస్తున్న తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. యార్డులో ఈ-నామ్ సిస్టంలు ఉండే గదిని పరిశీలించారు. అనంతరం కోల్డ్ స్టోరేజ్ మిర్చి వ్యాపారులను పిలిపించి, సమావేశం ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో జరిగిన ధరలను ఆయన పరిశీలించారు. వారివెంట జాయింట్ డైరెక్టర్ మల్లేశం, మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.వెంకట్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి శంషీర్, సూపర్‌వైజర్ రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ రంగనాథ్

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ ● ములుగులో నేర పరిశీలన సమీక్ష

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 16: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించాలని మల్టీజోన్-1 ఐజీ ఏవీ.రంగనాథ్ అన్నారు. ములుగులోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎస్పీ శబరీశ్ అధ్యక్షతన నేర పరిశీలన సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పెండింగ్ కేసులపై పోలీస్‌స్టేషన్ల వారీగా ఐజీ సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ 2022 కన్నా ముందు పెండింగ్‌లో ఉన్న కేసులను నెల రోజుల్లో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ములుగు జిల్లాలో మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న దృష్ట్యా రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఛత్తీస్‌గఢ్, ములుగు సరిహద్దు ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ బలగాల ద్వారా ముమ్మర తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రజలకు ఎన్నికల ప్రక్రియ పట్ల నమ్మకం కలిగేలా గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాలని, నగదు, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చెక్‌పోస్టుల వద్ద నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గంజాయి రవాణా ఎక్కువ జరుగుతున్న నేపథ్యంలో జిల్లా రహదారులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రధాన, ఇతర కూడళ్ల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబా సాహెబ్, డీఎస్పీలు రవీందర్, రాములు, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ములుగు, పస్రా, ఏటూరునాగారం, వెంకటాపురం సీఐలు రంజిత్‌కుమార్, శంకర్, రాజు, బండారి కుమార్, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన చల్లగరిగ

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో సిరిపెల్లి సుధాకర్ మృతి

చిట్యాల, ఏప్రిల్ 16: భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామానికిచెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు ఉద్యమ ప్రస్థానం ముగిసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్, బస్తర్ ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుధాకర్ మృతిచెందినట్లు తెలియడంతో చల్లగరిగ గ్రామం ఉలిక్కిపడింది. సిరిపెల్లి ఓదెలు - రాజపోచమ్మ దంపతులకు ఓ కుమారుడు, ఓకుమార్తె కాగా, సుధాకర్ స్థానికంగా 9వ తరగతి చదువుతున్న క్రమంలో పీపుల్స్‌వార్ పార్టీలో సానుభూతి పరుడిగాపనిచేసి 2000లో పూర్తిస్థాయిలో అజ్ఞాతంలోకి వెళ్లాడు. తన చిన్నమ్మ కుమారుడు కలికోట శంకర్ అప్పటికే పీపుల్స్‌వార్‌లో ఉండంతో సుధాకర్ పార్టీకి దగ్గరయ్యాడు. సుధాకర్ తండ్రి ఓదెలు 15 యేళ్ల కిందట మృతి చెందాడు. ఇక సోదరి స్వరూప, ఆమె భర్త మృతిచెందడంతో వారి కుమార్తె, కుమారుడిని సుధాకర్ తల్లి రాజపోషమ్మ పోషిస్తోంది. మనవరాలికి వివాహం కాగా, మనువడు హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. రాజపోషమ్మ చల్లగరిగలోని ఇంటివద్దే ఉంటూ వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. సుధాకర్ మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడన్న వార్త తెలవడంతో రాజపోషమ్మ, కుటుంబ సభ్యులు కంటతడి పెట్టారు.

స్నేహంతో ముడిపడిన నేపథ్యం

చల్లగరిగ గ్రామానికి చెందిన సిరిపెల్లి సుధాకర్, రౌతు విజేందర్ స్నేహితులు, సుధాకర్ అన్న కలికోట శంకర్ పీపుల్స్‌వార్‌లో పనిచేస్తుండడంతో వీరు కూడా అటు నడిచి.. 1996-98ల్లో వరంగల్ సెంట్రల్ జైలు జీవితం గడిపారు. 2000లో సుధాకర్, విజేందర్ పూర్తి స్థాయిలో దళ సభ్యులుగా ఉద్యమ జీవితాన్ని ప్రారంభించగా విజేందర్ అలియాస్ శ్రీను ఐదేళ్ల కిందట ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. సుధాకర్ నిజామాబాద్ జిల్లా ఏరియా జిల్లా కమిటీ సభ్యుడిగా, అనంతరం శంకర్ పేరుతో ఛత్తీస్‌గఢ్ ఏరియాలో జిల్లా కార్యదర్శిగా పని చేసినట్లు సమాచారం.

అడవిలో ముగిసిన చల్లగరిగ ప్రస్థానం

చల్లగరిగ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మావోయిస్టు ఉద్యమాల్లో చురుకైన పాత్రను పోషించారు. కలికోట శంకర్ 1996లో భూపాలపల్లి ఏరియాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో, రౌతు విజేందర్ ఐదేళ్ల కిందట, తాజాగా సిరిపెల్లి సుధాకర్ మృతితో ఉద్యమ నేపథ్యం ముగిసింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను
పకడ్బందీగా నిర్వహించాలి..

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన

నియోజకవర్గ పరిధిలోని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 16: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు కృషిచేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన కోరారు. ఈ మేరకు నల్గొండ కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గపరిధిలోని వివిధ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులతో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సిబ్బంది, శిక్షణ కేంద్రాల గుర్తింపు, డీఆర్సీ, స్ట్రాంగ్ రూమ్స్, ఎఫ్ఎస్టీ, ఎంసీసీ బృందాల ఏర్పాటు, మాస్టర్ ట్రైనర్లు, నోడల్ అధికారుల నియామకం, జోనల్ ఆఫీసర్, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, పోలింగ్‌కు అవసరమైన వాహనాలు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారి హరిచందన వివిధ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు డాక్టర్ కె.నారాయణ, ఎన్.వెంకటేష్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మనోళ్లు మెరిశారు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదుగురికి సివిల్స్ ర్యాంకులు


కుటుంబ సభ్యులతో 568వ ర్యాంకు సాధించిన సైంపు కిరణ్‌కుమార్


కుటుంబ సభ్యులతో కౌశిక్


తల్లిదండ్రులతో 554వ ర్యాంకు సాధించిన ప్రణయ్ కుమార్

వరంగల్ ఎడ్యుకేషన్/ గీసుకొండ, ఏప్రిల్ 16: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా యువకులు మెరిశారు. మొత్తం ఐదుగురు ఉత్తమ ర్యాంకులు సాధించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ నగర్‌కు చెందిన రావుల జయసింహారెడ్డి 103 ర్యాంకు, వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన సైంపు కిరణ్‌కుమార్ 568, వరంగల్ జిల్లా కేంద్రంలోని శివనగర్‌కు చెందిన కోటే అనిల్‌కుమార్ 743, జనగామ పట్టణానికి చెందినమెరుగు కౌశిక్ 82, జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రణయ్ కుమార్ 554వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. వీరిలో హనుమకొండ విద్యుత్‌నగర్‌కు చెందిన జయసింహారెడ్డి గతేడాది సివిల్స్‌లో 217వ ర్యాంకు సాధించి ఐపీఎస్ శిక్షణలో ఉన్నారు. కానీ ఐఏఎస్ లక్ష్యంతో తాను సివిల్స్ రాశానని, ఇప్పుడు వచ్చిన ర్యాంకుతో ఐఏఎస్ వచ్చే అవకాశం లేదని జయసింహారెడ్డి తెలిపారు. అనిల్‌కుమార్ స్పందిస్తూ గతేడాది 4వ ప్రయత్నంలో 584 ర్యాంకు రాగా, ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో అకౌంట్స్ విభాగం కోల్‌కత్తాలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని, చివర ప్రయత్నంగా ఐఏఎస్ గాని ఐపీఎస్ గానీ వస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు.

జనగామ జిల్లాలో ఇద్దరికి ఉత్తమ ర్యాంకు

జనగామ కల్చరల్ / రఘునాథపల్లి: జనగామ జిల్లా నుంచి ఇద్దరు యువకులు సత్తా చాటారు. జిల్లాకేంద్రానికి చెందిన మెరుగు సుజాత - సుధాకర్ దంపతుల కుమారుడైన మెరుగు కౌశిక్ యూపీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో 82వ ర్యాంకు సాధించాడు. జనగామలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యనభ్యసించిన కౌశిక్ ఆ తర్వాత హైదరాబాద్ లో హైస్కూల్ విద్య పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ లో బీటెక్ పూర్తి చేసి ఢిల్లీ లోని ఐఏఎఫ్‌టీ లో సివిల్ కోచింగ్ తీసుకొని మొదటి ప్రయత్నంలోనే జాతీయ స్థాయి 82వ ర్యాంకు సాధించాడని తల్లిదండ్రులు తెలిపారు. కాగా కౌశిక్ తండ్రి సుధాకర్ 20 ఏళ్లుగా హైదరాబాద్‌లో బిల్డర్‌గా స్థిరపడ్డారు.

నిరుపేద విద్యార్థికి 554వ ర్యాంకు

రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రణయ్ కుమార్ అనే నిరుపేద విద్యార్థి తన రెండో ప్రయత్నంలో 554వ ర్యాంకు సాధించి సివిల్స్‌కు ఎంపికయ్యాడు. రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రభాకర్-లక్ష్మి దంపతులు బతుకుదెరువు కోసం కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్ వలస వెళ్లారు. వారి మూడో కుమారుడైన ప్రణయ్ కుమార్ పదోతరగతి వరకు నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, పాలిటెక్నిక్.. గజ్వేల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో బీ టెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ చదివాడు. అనంతరం ఎలాగైనా సివిల్స్ సాధించాలనే పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే స్టడీ సర్కిల్‌లో చేరి కష్టపడి చదివి రెండవ ప్రయత్నంలో 554వ ర్యాంకు సాధించి సివిల్స్‌కు ఎంపికయ్యాడు. దీంతో ప్రణయ్ కుమార్‌కు ఐఏఎస్ అయ్యే అవకాశం రానుండగా..

గతేడాది యూపీఎస్సీ పరీక్షలో మొదటి సారే ప్రణయ్ కుమార్ 885వ ర్యాంకు సాధించి ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యాడు. ఈ ర్యాంకుతో ఐఏఎస్ అవకాశం రాకపోవడంతో రెండో సారి ప్రయత్నించగా 554వ ర్యాంకు వచ్చింది. దీంతో ప్రస్తుతం రఘునాథపల్లిలోనే నివాసముంటున్న ప్రణయ్ కుమార్ కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ప్రణయ్ కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

సాధారణ కుటుంబం నుంచి

వరంగల్ జిల్లా గీసుగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సయింపు ప్రభాకర్, జయలక్ష్మి కుమారుడు కిరణ్ మంగళవారం యూపీఎస్సీ ఫలితాల్లో 568 ర్యాంకు సాధించారు. సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి ఐపీఎస్‌గా ఎంపిక కానున్న కిరణ్ గతంలో సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్స్(సీఏపీఎఫ్)లో కూడా ఆల్ ఇండియా 15వ ర్యాంకు సాధించి అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేశారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి ఐఏఎస్ సాధించటమే లక్ష్యంగా యూపీఎస్సీ పరీక్షకు హాజరయ్యారు. ఈసారి కిరణ్ ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్(ఐఐఎస్) అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. అనంతరం ఇండియన్ పోస్టల్ సర్వీస్ అధికారిగా అవకాశం వచ్చిన కిరణ్ విధులు నిర్వహిస్తూనే చివరి ప్రయత్నంగా మరోసారి యూపీఎస్సీ పరీక్షకు హాజరై 568ర్యాంకు సాధించారు. అనుకున్న లక్ష్యానికి చేరువయ్యాడు. దీంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ వ్యవసాయకుటుంబానికి చెందిన ప్రభాకర్, జయలక్ష్మీ దంపతులకు కుమారుడు కిరణ్, కుమార్తె గిరిజ ఉన్నారు. ఎంతో కష్టపడి ప్రభాకర్ దంపతులు కిరణ్, గిరిజను చదివించగా.. గిరిజ కూడా ట్రిపుల్ ఐటీ చెన్నైలో ఎం.టెక్ పూర్తి చేసి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కిరణ్ 3వ తరగతి వరకు మచ్చాపూర్, 5వ తరగతి వరకు గిర్నిబావి వద్ద గల ఓ ప్రైవేటు పాఠశాలలో చదివాడు. అనంతరం జవహర్ నవోదయ ఎంట్రన్స్ పరీక్ష రాసి వరంగల్ మామునూరు నవోదయ పాఠశాలలో సీటు సాధించాడు. అక్కడ పదోతరగతి పూర్తిచేసిన కిరణ్ గుంటూరు బాష్యం పాఠశాలలో ఇంటర్, ఐఐటీ ఢిల్లీలో 2017లో బీటెక్ పూర్తిచేశాడు. అనంతరం సివిల్స్‌పై దృష్టిపెట్టి విజయం సాధించాడు.

ఐఏఎస్ రాకపోవచ్చు..

రావుల జయసింహారెడ్డి, ఐపీఎస్

గత ఏడాది సివిల్స్ ఫలితాల్లో 217వ ర్యాంకు రాగా ఐపీఎస్ సాధించాను. ఐఏఎస్ కావాలనే ఆశయంతో మళ్లీ సివిల్స్ రాశాను. అయితే ఈ సారి 103వ ర్యాంకు వచ్చింది. జనరల్ కేటగిరీలో ఐఏఎస్ రాకపోవచ్చు. నాకు ఎల్లవేళలా తోడ్పాటును అందిస్తున్న అమ్మానాన్న డాక్టర్ రావుల ఉమారెడ్డి-లకు ఎప్పుడూ విధేయపాత్రుడుగానే ఉంటాను. వరంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానంలో ఏడీగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రావుల ఉమారెడ్డి కుమారుడే జయసింహారెడ్డి కావడం విశేషం.

ఆఖరి ప్రయత్నంలో సాధించా..

సైంపు కిరణ్‌కుమార్, ఇండియన్ పోస్టల్ సర్వీస్, ఆంధ్రప్రదేశ్

ఐఏఎస్ లేదా ఐపీఎస్ కావాలనే ఉన్నత లక్ష్యంతో చదివాను. ఐఐటీ ముంబై, చెన్నై ఐఐటీల్లో సీటు వచ్చినా సివిల్స్ ప్రిపేర్ కావచ్చుననే ఆశయంతో ఢిల్లీ ఐఐటీలో చేరాను. ఐదో ప్రయత్నంలో రిజర్వ్‌డ్ ర్యాంకుతో ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో ఉద్యోగంలో చేరాను. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్టణాల్లో పని చేస్తున్నాను. ఐఏఎస్ లక్ష్యంతో ఆఖరి ప్రయత్నంగా ఆరోసారి సివిల్స్ రాశాను. ఇప్పుడు వచ్చిన ర్యాంకుతో ఐఆర్ఎస్ వచ్చే అవకాశం ఉంది. ప్రజలకు నిరంతరం సేవ అందించడమే నా లక్ష్యం. కాగా, అనంతారానికి చెందిన కిరణ్‌కుమార్ తల్లిదండ్రులు ప్రభాకర్-జయలక్ష్మి రైతులు.

ఐఏఎస్ లక్ష్యంతో ఆఖరి సారి రాస్తాను..

కోటే అనిల్‌కుమార్, డీడీ, ఇండియన్ పోస్టల్ సర్వీసెస్, వెస్ట్‌బెంగాల్

ఇప్పటివరకు 5సార్లు సివిల్స్ రాశాను. నాలుగోసారి వచ్చిన 584 ర్యాంకుతో ఇండియన్ పోస్టల్ సర్వీసెస్‌లో ఎకౌంట్స్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాను. నిట్ వరంగల్ నుంచి ఇంజనీరింగ్ పట్టా అందుకున్నాక రెండేళ్ల ఏఈగా పనిచేశారు. అనంతరం రైల్వేస్‌లో పని చేశారు. గత ఏడాది సివిల్స్‌లో వచ్చిన ర్యాంకుతో ప్రస్తుతం పోస్టల్ సర్వీసెస్‌లో పనిచేస్తున్నారు. ఇప్పటికీ ఐదుసార్లు రాశాను. ఆఖరి ప్రయత్నంగా మరోసారి సివిల్స్ రాసి ఉన్నత లక్ష్యాన్ని సాధిస్తాను.

రేపటి నుంచి 'లోక్‌సభ'
నామినేషన్ల స్వీకరణ

25 వరకు దాఖలుకు అవకాశం

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికలకు గాను గురువారం నోటిఫికేషన్ వెలువడనుండగా.. ఆదేరోజునుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. 25వ తేదీ వరకు దాఖలుకు అవకాశం ఉండగా.. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చు. సెలవులు మినహా మిగిలిని రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. వరంగల్ నియోజకవర్గానికి సంబంధించి వరంగల్ కలెక్టరేట్‌లో, మహబూబాబాద్ నియోజకవర్గానికి సంబంధించి మహబూబాబాద్ కలెక్టరేట్‌లో అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేస్తోంది.

అభ్యర్థులు పాటించాల్సినవి..

- ఒక్కో అభ్యర్థి నాలుగుసెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అభ్యర్థి వెంట నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుంది.
- జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు ప్రతిపాదించాల్సి ఉంటుంది. రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే వారికి, స్వతంత్ర అభ్యర్థులకు 10మంది ఓటర్లు ప్రతిపాదించాలి.
- పోటీ చేసే అభ్యర్థులు వేరే లోక్‌సభ సెగ్మెంట్‌కు చెందిన వారైటొ తప్పనిసరి వారి అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్‌వో నుంచి ఓటరు ధృవీకరణ పత్రం సమర్పించాలి.
- అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయవచ్చు. సంబంధిత బ్యాంకు ఖాతా లావాదేవీల ఆధారంగానే అభ్యర్థులు వ్యయాన్ని లెక్కిస్తారు.
- క్రిమినల్ కేసులు ఉంటే నామినేషన్ పత్రంలోని పార్ట్-3 ఏలో ఆ వివరాలు తప్పనిసరిగా పొందుపర్చాలి.
- ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలి.
- కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించే విషయంలో సెక్షన్ 127-ఏ సూచనలు పాటించాలి.
- ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

క్రీడాకారుల వసతిని నిలిపి వేస్తే సహించేది లేదు..

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్16: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ (జేఎన్ఎస్)లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుల కోసం నిర్వహిస్తున్న రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతిని నిలిపివేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వివిధ క్రీడలకు నిలయంగా విరాజిలుతున్న జేఎన్ఎస్‌లో పలురకాల క్రీడలతో పాటు అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాంశాలలో శిక్షణ పొందుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తూ పలు పతకాలను సాధిస్తున్నారన్నారు. రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో పలు క్రీడాంశాలలో శిక్షణ పొందుతూ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న క్రీడాకారులను మినహాయించి అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుల వసతి నిలిపి వేసే యోచనలో స్పోర్ట్స్ అధికారులు ఉన్నారని తమకు విశ్వసనీయ సమాచారం ఉందన్నారు. ఏళ్ల చరిత్ర కలిగిన రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులు వసతిని ఎత్తి వేసే యోచనను స్పోర్ట్స్ అధికారులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కడియం శ్రీహరి రాజకీయ ద్రోహి

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ● రాజకీయ ఊసరవెల్లి కడియం శ్రీహరి : పల్లా ● మడికొండలో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం

మడికొండ, ఏప్రిల్ 16: దేశంలోనే నెంబర్ వన్ రాజకీయ ద్రోహి, నీతిమాలిన రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ కడియం శ్రీహరి అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. మడికొండలోని సత్యసాయి గార్డెన్స్‌లో మంగళవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన లోక్‌సభ ఎన్నికల స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీమంత్రి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో ఇంత దిగజారిన మోసగాడిని ఇంతవరకు చూడలేదన్నారు. కేసీఆర్ ఆయనకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి, ఉపముఖ్యమంత్రి పదవి, ఆయనకు కూతురుకు ఎంపీ టికెట్ ఇచ్చినా పార్టీ మారాడని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారానని చెప్పుకోవడానికి సిగ్గుండాలన్నారు. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి గెలవాలని ఎర్రబెల్లి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. ఒక్కఆర్టీసీ ఉచిత ప్రయాణం అమలు చేశారని, కొద్ది రోజుల తర్వాత అదికూడా ఎత్తేస్తారని జోస్యం చెప్పారు. నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని దయాకర్‌రావు తెలిపారు. శాసన మండలి వైస్‌చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ... తెలంగాణ రాజకీయాల్లో ఎవరు దొంగ అంటే కడియం శ్రీహరి పేరు చెబుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన బీఫామ్‌తో గెలిచిన కడియం శ్రీహరి.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఒకవైపు, కాంగ్రెస్ పార్టీ మరోవైపు రెండు పార్టీలు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలు అవుతున్నాయో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కడియం శ్రీహరి పార్టీలు మారడం చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతోందన్నారు. ద్రోహం అంటేనే కడియం శ్రీహరి అన్నారు. 2023 లో ఎదురు గాలి వీచినా స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలు గులాబీ జెండాను చూసి కడియంను గెలిపించారన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య, తాను అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని పేర్కొన్నారు. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ రెండు నియోజకవర్గాలను రెండు కళ్లుగా కాపాడుకుంటానని స్పష్టం చేశారు. నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నిక ఒక మోసగాడికి, ఒక నీతిమంతుడికి జరుగుతున్న పోరు అని తెలిపారు. సుధీర్‌కుమార్‌ను అధిక మెజారిటీతో గెలిపించి ఢిల్లీకి పంపుదామని స్పష్టం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య మాట్లాడుతూ.. కడియం శ్రీహరి ఒక నీచుడు, నికృష్టుడు, దుర్మార్గుడు.. దేశం మొత్తంలోనే ద్రోహి అని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా రాజయ్య ఉద్వేగానికి గురయ్యారు. తాను కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటే శ్రీహరి కంట్లో పెట్టుకుని బాధపెట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తన ఎమ్మెల్యే పదవి, ఎంపీ పదవి, ఉప ముఖ్యమంత్రి పదవి అన్నీ లాక్కున్న నికృష్టుడని, దళిత ద్రోహి అని మండిపడ్డారు. అవినీతిలో పెద్ద తిమింగలం అన్నారు. శ్రీహరిని ధర్మసాగర్ చెరువులో తొక్కితే పాకిస్థాన్‌లో తేలాలన్నారు. మొదటిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఆయనకు ఉన్న ఆస్తులు.. ఇప్పుడు ఉన్న ఆస్తులు లెక్కచూడాలని అన్నారు. ఇక నుంచి కడియంను ప్రతీచోట నిలదీస్తామని, ఎక్కడైనా ఢీకొనేందుకు సిద్ధంగా ఉన్నామని సవాల్ చేశారు. నిజాయితీపరుడైన సుధీర్‌కుమార్‌ను గెలిపించుకోనేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ఇది నీతికి, అవినీతికి మధ్య జరుగుతున్న పోరాటమని, నీతికి పట్టం కట్టి విలువలు కలిగిన రాజకీయాలని కాపాడుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కావ్య గెలుపులో ఎన్ఎస్‌యుఐ కీలక పాత్ర పోషించాలి

వరంగల్ లోక్‌సభ ఎన్నిక, ఎన్ఎస్‌యూఐ సన్నాహక సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 16: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య గెలుపులో ఎన్ఎస్‌యూఐ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ హంటర్‌రోడ్డులో వరంగల్ లోక్‌సభ ఎన్నిక, ఎన్ఎస్‌యూఐ సన్నాహక సమావేశం జరిగింది. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పల్లంకొండ సతీశ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా రోహిత్ చౌదరితో పాటు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా రోహిత్ చౌదరీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో అగ్రనేత రాహుల్‌గాంధీ యువతకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. విద్యారుణాల వడ్డీమాఫీ, ఏటా 30లక్షల ఉద్యోగాల భర్తీ ఇలా యువతకు ప్రయోజనం చేకూరే హామీలు ఇచ్చారన్నారు. ఈ క్రమంలో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ శ్రేణులు గ్రామీణ ప్రాంతాల నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఇంటింటికీ మేనిఫెస్టో తీసుకెళ్లాలని సూచించారు. అదే విధంగా విద్యారంగ సంస్థలను కూడా సందర్శించి యువతకు వివరించాలన్నారు. పార్టీ కోసం శ్రమించే వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. ఇందుకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నిదర్శనమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు లోక్‌సభ ఎన్నికలో రెండు, మూడు స్థానాల కోసమే పోటీపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రజల్లో విశ్వాసం సడలిందన్నారు. రాహుల్‌గాంధీని ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య విషయంలో బీజేపీ శ్రేణులు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తే ఊరుకోమని, బట్టలూడదీసి కొడతామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హెచ్చరించారు. బీజేపీ పుట్టక ముందే రాముడు దేశ ప్రజలకు దేవుడని స్పష్టం చేశారు. బీజేపీని గద్దె దించడానికి ఎన్ఎస్‌యూఐ శ్రేణులు సైనికుల్లా పోరాడాలని సూచించారు. కష్టపడి పనిచేస్తే పార్టీ తప్పక ఆదరిస్తుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లంకొండ సతీశ్ వెల్లడించారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్నో దౌర్జన్యాలను ఎదుర్కొన్నామన్నారు. ప్రతీ విషయంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అండగా ఉన్నారన్నారు. డాక్టరు కడియం కావ్య గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. బీజేపీకి ధనబలం ఉంటే కాంగ్రెస్‌కు జనబలం ఉందని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కావ్య అన్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ కబ్జాల చరిత్రను ప్రజలు మరువలేదన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశానికే ప్రమాదకరమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ లోకసభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎన్ఎస్ యూ, యూత్ కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కుల రమాకాంత్‌రెడ్డి, చందనరెడ్డితో పాటు కత్తి వెంకటస్వామి, బంక సరళ, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, సునితా ఆనంద్, మోజెస్ ఆనంద్, డాక్టర్ శ్రవణ్, బంక సంపత్ యాదవ్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి

ఉద్యమకారులకు ద్రోహం చేసిన కేసీఆర్



డోర్నకల్‌లో మాట్లాడుతున్న సీతారాంనాయక్

• బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్

డోర్నకల్, ఏప్రిల్ 16 : తెలంగాణ ఉద్యమంలో చురుగా పాల్గొన్న ఉద్యమ నాయకులను కేసీఆర్ ద్రోహం చేశారని బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ ఆరోపించారు. డోర్నకల్ జైన్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌ను మానుకోటకు తీసుకువచ్చి, ప్రజలపై కాల్పులు జరిపించిన రెడ్యానాయక్, ఆయన కుమార్తె కవితను ప్రజాప్రతినిధులుగా చేశారని, తనలాంటి ఉద్యమకారులను అణగదొక్కి, ఉద్యమద్రోహులైన వారికి పదవులు కట్టబెట్టారని విమర్శించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు దేవాసింగ్‌నాయక్, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు గణేష్‌నాయక్, డోర్నకల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ భూక్య సంగీత, నాయకులు రెహమాన్, జయరాజ్, సుదర్శన్, రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చిన్నగూడూరు : ప్రజలు కేసీఆర్‌ని ఓడించేందుకే కాంగ్రెస్‌ను గెలిపించారని సీతారాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బోడ్రాయి సెంటర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, ఆయన మాట్లాడారు. అనంతరం మండలానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బీజేపీ పార్టీలో చేరారు. మండల అధ్యక్షుడు గుగులోత్ లక్ష్మణ్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న, సంగీత, వెంకటిరెడ్డి, మధు, శ్రీనివాస్, వేణు, యాకమ్మ, బాలు, అశోక్, వీరేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

● కురవి : కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఎంపీ ఎన్నికల్లో ఓటువేస్తే ప్రయోజనం లేదని, బీజేపీని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. కురవిలో జరిగిన బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షు ఎస్వీఎన్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సంగీత, కొంతం పెంటయ్య, ధర్మారపు వెంకన్న, వెంకటిరెడ్డి పాల్గొన్నారు.

● సీరోలు : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో ముచ్చటగా మూడోసారి బీజేపీ అధికారంలోకి రాబోతుందని సీతారాంనాయక్ అన్నారు. సీరోలులో బూత్‌స్థాయి సమావేశం నిర్వహించారు. నాయకులు వెంకన్న, వెంకటిరెడ్డి, సంగీత, జోగి దిలీప్, వీరన్న, యాకయ్య, సురేష్, సతీష్, రంగయ్య కాశీపతి పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌ను నిర్దేశించేది ఓటుహక్కు

• కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 16 : దేశ భవిష్యత్‌ను నిర్దేశించేది ఓటుహక్కు అని, దానిని ప్రజలు గుర్తించాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో మంగళవారం స్వీప్-5కే రన్‌ను నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కలెక్టర్ జెండా ఊపి 5కెరన్‌ను ప్రారంభించగా, పురవీధుల గుండా తహసీల్ ఆఫీస్ వరకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యదేశం భారత్‌లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతం కంటే ఎక్కువగా నమోదు కావాలని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులంతా ఓటుహక్కు నమోదు చేసుకోవడంతో పాటు ఓటు వేయాలని పేర్కొన్నారు. కళాశాలలు, విద్యాసంస్థల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తప్పనిసరిగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఓటు వినియోగంపై సాంస్కృతిక కళాబృందం సభ్యులు పాటలు పాడి అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, డీఎఫ్‌వో బత్తిని విశాల్, ట్రైనీ ఐపీఎస్ పండరి చైతన్, అదనపు ఎస్పీ చెన్నయ్య, ఆర్డీవో అలివేలు, అధికారులు మరియన్న, డాక్టర్ కళావతిబాయి, రవీందర్, రామారావు, సురేష్, భగవాన్‌రెడ్డి, అవినాష్ పాల్గొన్నారు.



స్వీప్-5కే రన్ ముగింపులో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్ సింగ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

● ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన దాసరి

మహబూబాబాద్ టౌన్ ఏప్రిల్ 16 : త్వరలో జరగబోయే వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ నల్లగొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన దాసరి అన్నారు. నల్లగొండ కలెక్టర్ కార్యాలయం నుంచి వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందనదాసరి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన మేర పోలింగ్ సిబ్బందిని సన్నద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చేలా కార్యచరణ రూపొందించాలని, రూట్ మ్యాప్‌లు తయారు చేయాలన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూములను పర్యవేక్షించాలని, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలకు మాస్టర్ ట్రైనర్లచే చేపట్టే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని హరిచందన సూచించారు. అవసరమైన ఎన్నికల ఖర్చు నివేదికలను తయారు చేసి పంపాల్సిందిగా తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, తహసీల్దార్లు భగవాన్‌రెడ్డి, సైదులు, ఎలక్షన్ సూపరిండెంట్ పవన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో వెంకటరమణ పాల్గొన్నారు.

బావిలో శవమై తేలిన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు

• మతిస్థిమితం లేక మూడు రోజుల క్రితం అదృశ్యం

• గతంలో మార్కెట్ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు



చిర్రగోని సారయ్య (ఫైల్)

కేసముద్రం, ఏప్రిల్ 16 : మూడురోజుల క్రితం అదృశ్యమైన కేసముద్రం కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు చిర్రగోని సారయ్య (64) కల్వల సమీపంలోని వ్యవసాయ బావిలో మంగళవారం రాత్రి శవమైతేలాడు. అమీనాపురంలో ఉంటున్న ఆయన కొద్దిరో జులుగా మెదడు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో మతిస్థితిమితం సరిగాలేక ఈనెల 13న తెల్లవారుజామున ఇంట్లోకి బయటకు వెళ్లిపోయాడు. ఆరోజు నుంచికుటుంబసభ్యులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయన కోసం వెతుకుతున్నారు. ఈ విషయంపై అదే రోజు ఆయన కుమారుడు శ్యాంప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వ్యవసాయ బావిలో శవం ఉన్నట్లు రైతు గుర్తించాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడికి చేరుకొని మృతదేహం ఆనవాళ్లను బట్టి సారయ్యదేనని గుర్తించారు. సారయ్యకు భార్య కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. చిర్రగోని సారయ్య కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలం పని చేశారు. మండల పార్టీ అధ్యక్షుడిగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మార్కెట్ వైస్ చైర్మన్‌గా పని చేశారు. ఆయన మృతి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు ఘటన స్థలానికి చేరుకుని, కుటుంబసభ్యులను ఓదార్చారు.

20 నుంచి ఉచిత క్రికెట్ కోచింగ్ ప్రారంభం

● జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 : జిల్లా కేంద్రంలో ఈనెల 20 నుంచి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి క్రికెట్ కోచింగ్ క్యాంపు ఉంటుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి మంగళవారం తెలిపారు. ఏప్రిల్ 18 వరకు ఆసక్తిగల క్రీడాకారులు అండర్-14, అండర్- 16, అండర్-19 బాలబాలికలు, ఓపెన్ కేటగిరిలో క్రీడాకారులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను సమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్‌నెంబర్ : 98852 67524, 93983 64687లను సంప్రదించాలన్నారు.

మొరాయించిన ఈ-నామ్ సర్వర్

రెండు గంటలు ఆలస్యంగా ఈ-వేలం విన్నర్ లిస్ట్ విడుదల

కేసముద్రం, ఏప్రిల్ 16 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మంగళవారం ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) సర్వర్ మొరాయించింది. వ్యాపారులు 'ఈ-వేలం'లో పాల్గొనేందుకు తమ ఐడీల ద్వారా ఈ-నామ్ పోర్టల్‌లో ప్రయత్నించగా లాగ్‌ఇన్ కాకుండా సతాయించినట్లు పలువురు వ్యాపారులు తెలిపారు. ఆలస్యంగా ధరలు నమోదు కావడంతో మధ్యాహ్నం 12.30 గంటలకు విడుదల చేయాల్సిన ఈ-వేలం విన్నర్ లిస్టును మూడు గంటల ప్రాంతంలో రిలీజ్ చేయాల్సివచ్చింది. ఫలితంగా సరుకుల నింపడం, కాంటాలు నిర్వహించడం రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. మార్కెట్ వచ్చిన సరుకుల్లో అధికంగా 175 మంది రైతులు 13,846 బస్తాల్లో 8,308 క్వింటాళ్ల మొక్కజొన్నలు తీసుకురాగా ఈ-వేలంలో క్వింటాకు గరిష్ఠంగా రూ.2151, కనిష్ఠంగా రూ.2009, సగటున రూ.2119 ధరలతో ఖరీదులు చేశారు.

దుర్గమ్మగుడి నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

కేసముద్రం, ఏప్రిల్ 16 : మండలంలోని బేరువాడలో బంజార గిరిజనుల ఆధ్వర్యంలో నిర్మించే దుర్గమ్మగుడి నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వద్మ-వెంకన్న దంపతులు రూ.రెండు లక్షల 116 వేల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు గుడి నిర్మాణ కమిటీకి నగదును మంగళవారం అందించారు. కార్యక్రమంలో గుడి కమిటీ నిర్మాణ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 16 : మండలంలోని ముడుపుగల్ క్రాస్‌రోడ్డు వద్ద ఎండ తీవ్రతకు తట్టుకోలేక బైక్‌పై నుంచి సొమ్మసిల్లిపడిపోయిన వ్యక్తి వద్దకు అటుగా వెళ్తున్న మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ వెళ్లి పల్స్‌చూసి అనంతరం 108 ద్వారా అతన్ని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ముడుపుగల్‌లో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు జిల్లా కేంద్రం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ వెళ్తున్నాడు. సరిగ్గా అదే సమయంలో తాళ్లపూసపల్లి నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న ఓవ్యక్తి ఎండతీవ్రతను తట్టుకోలేక బైక్‌పై నుంచి సొమ్మసిల్లికిందపడిపోయాడు. గమనించిన మురళీనాయక్ అతని వద్దకు వెళ్లి అతని నాడీ పట్టుకుని పల్స్ పరిశీలించారు. ఆపై వైద్యచికిత్స నిమిత్తం 108కు స్వయంగా ఫోన్ చేసి రప్పించి జిల్లా ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు.

నామినేషన్‌కు భారీగా తరలిరావాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్16 : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణ ఈ నెల 23న జిల్లా కేంద్రంలో నామినేషన్ వేస్తున్నారని ఈ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలిరావాలని ఆ పార్టీ పార్లమెంట్ ఎన్నికల కమిటీ కన్వీనర్ సీతారామయ్య పిలుపునిచ్చారు. మానుకోట జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీ పార్టీ అభ్యర్థి మురళీకృష్ణ నామినేషన్‌కు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతున్న సీఎం

(5వ పేజీ తరువాయి)

గుప్పించడం, వాటిని నేరవేర్చకపోవడం చేసేదని, కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను తూ.చా తప్పకుండా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, నర్సంపేట, మానుకోట, డోర్నకల్, భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, భూక్య మురళీనాయక్, జాటోతు రాంచంద్రునాయక్, తెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లు, నాయకులు ఘనపురపు అంజయ్య, నూనావత్ రాధ, బండారు వెంకన్న, నారోజు సత్యమనోరమ, చుక్కల ఉదయ్‌చందర్, గునిగంటి కమలాకర్, బోడ రవినాయక్, పాల్గొన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు

కురవి : కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రత్యేక పూజలు జరిపారు. వీరభద్రస్వామి, భద్రకాళి ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వీరభద్రస్వామి దీవెనలతో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిని అయ్యాయని, ఆలయ అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తానన్నారు.

ఎంపీ రవిచంద్రకు ఘన సన్మానం



రవిచంద్రను సన్మానిస్తున్న ఎమ్మెల్సీలు రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 16 : మానుకోట పట్టణంలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఘనంగా సత్కరించారు. ఎంపీగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా మహబూబాబాద్‌లో అడుగు పెట్టిన రవిచంద్రను మంగళవారం ఎంపీ కవిత, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లా అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు గద్దె రవి, మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న పాల్గొన్నారు.

నక్కను కాపాడిన ఫారెస్ట్ అధికారులు

సీరోలు, ఏప్రిల్ 16 : వ్యవసాయ బావిలో పడిన నక్కను ఫారెస్ట్ అధికారులు కాపాడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫారెస్ట్ సెక్షన్ అధికారి మూడు శ్రీనివాస్, బీట్ అధికారి రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం. సీరోలు మండలం కొత్తూరు (సి) గ్రామానికి చెందిన రైతు సామ అచ్చిరెడ్డి వ్యవసాయ బావిలో నక్క పడిందనే సమాచారం మేరకు ఐఎఫ్ఎస్ జిల్లా అటవీ అధికారి విశాల్ ఆదేశాల మేరకు మంగళవారం జేస్ క్యాంపు సిబ్బందితో కొత్తూరు చేరుకొని రెస్క్యూ ఆపరేషన్ చేసి బావిలో ఉన్ననక్కను సురక్షితంగా బయటకు తీశామని తెలిపారు. నక్క ఆరోగ్యంగా ఉండటంతో అడవిలో విడిచిపెట్టినట్లు శ్రీనివాస్, రవీందర్ తెలిపారు.

'ఎంపీగా మరోసారి ఆశీర్వదించండి'

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట నుంచి మరోసారి ఎంపీగా తనను ఆశీర్వదించి గెలిపించాలని స్థానిక పార్లమెంట్ సభ్యురాలు మాలోతు కవిత కోరారు. మహబూబాబాద్ ఎంపీ క్యాంపు కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా మంగళవారం భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి రావాల్సిన హక్కుల గూర్చి పార్లమెంట్‌లో కొట్లాడలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులకు అడ్డుకట్ట వేయాలి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 16 : దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తూ మనువాద భావజాలాన్ని బలవంతంగా ప్రజలపై రుద్దుతున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాత శక్తులకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రజాతంత్ర శక్తులపై ఉందని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో మంగళవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ,సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీల నాయకులు బి.విజయసారథి, సాదులశ్రీనివాస్, గౌని ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, గోనె కుమారస్వామి, కొత్తపల్లి రవి మాట్లాడారు. ఈ సదస్సులో బట్టు చైతన్య, పెరుగుకుమార్, గునిగంటి రాజన్న, కంచ వెంకన్న, లింగ్యా, సత్యం, ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, రాంమూర్తి, సీతారాం, నవీన్, వెంకన్న, శ్రావణ్, మధు, సక్క, లింగయ్య, సాయిలు, వెంకటేశ్వర్లు, సూర్యం, యాకయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఖాళీ చేద్దాం

• మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ పార్టీలో ఉన్న కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు గేట్లు తెరిచామని, త్వరలోనే బీఆర్ఎస్ పార్టీని ఖాళీ చేయిస్తామని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గూడూరులో నిర్వహించిన సమావేశంలో భూపతిపేట, కోబల్‌తండాకు చెందిన సుమారు 100 మంది బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, రమేష్‌చందర్‌రెడ్డి, ఉదయ్ చందర్, ఘనపురపు అంజయ్య, ప్రదీప్‌రెడ్డి, చిట్టి వెంకన్న, అర్రెం వీరస్వామి, శ్రీపాల్‌రెడ్డి, భాస్కర్ నాయక్, రాజబాబు, బొల్లికొండ మధు, చంటిస్వామి, సమ్మక్క, కొమ్మాలు, సురేష్, రసూల్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 16 : పట్టణ శివారు కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు రావుల రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్‌కు మంగళవా రం వినతిపత్రాన్ని అందజేశారు. గిరిప్రసాద్‌నగర్ కాలనీ అధ్యక్షుడు బొమ్మెర నాగేష్, అల్లి కృష్ణ, భూపతి శ్రీను, కైలాసకోటి, శేఖర్, వెంకటేష్, వినయ్, కుమార్, చందు, ఎస్కే.సాకీర్ పాల్గొన్నారు.

హైస్కూల్‌ను పరిశీలించిన ఎంపీడీవో

కేసముద్రం, ఏప్రిల్ 16 : మండలంలోని తాళ్లపూసపల్లి జడ్పీహైస్కూల్‌ను మంగళవారం ఎంపీడీవో బానోత్ రవికుమార్ పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, మన ఊరు-మన బడి కార్యక్రమంలో నిర్వహించిన పనులను, ఎంపీ ఎన్నికల పోలింగ్ బూత్‌లను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట హెచ్ఎం కోట కనకయ్య, జీపీ కార్యదర్శి కోలా దర్గయ్య, పీఈటీ ఎం.డి.నసీరుద్దీన్ ఉన్నారు.

అనంతారం, గాంధీపురంలో పోలీసుల కవాతు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 16 : జిల్లా కేంద్రం శివారు అనంతరం, గాంధీపురంలలో రూరల్ ఎస్సై దీపికరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా గాంధీపురం, అనంతారం గ్రామాల్లో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించినట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరు ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సూరయ్య, పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆదివాసీ అభ్యర్థిని గెలిపించాలి'

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 16 : మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో చంద లింగయ్య దొరను బలపరిచి నిలబెడుతున్నామని ఆదివాసీ సంఘాలు పేర్కొన్నాయి. జిల్లా కేంద్రంలో ఆదివాసీ, గిరిజన సంఘాల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మాణాలను ఆమోదించారు. వట్టం ఉపేందర్, దాట్ల నాగేశ్వర్‌రావు, రమణాల లక్ష్మయ్య, పొడుగు శ్రీనాథ్, వట్టం నారాయణదొర, వాసం రామకృష్ణ దొర, ముక్తిరాజు, వట్టం కన్నయ్య, ఈసాల రామచంద్రు, జబ్బ రాంమ్మూర్తి, మోకాల భాస్కర్, వరస శ్రీను, వజ్జ శ్రీను, పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరూ పాటుపడాలి'




మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్16 : ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ నలంద డిగ్రీ కళాశాలలో మంగళవారం కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ- లౌకికవాదం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన హాజరై మాట్లాడారు. డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ అన్నిమతాలు అనే భావన ద్వారా లౌకికవాదం అతి ముఖ్యమైనదని పేర్కొన్నారు. భారతరాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ సదస్సులో షైన శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.బి. శంకర్, అధ్యాపకులు కృష్ణారావు, రాజు, ముత్తయ్య, ప్రసాద్, శేఖర్, రవిశంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకులను నిలదీయాలి..

ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాలను నిలదీయాలని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ అన్నారు. మహబూబాబాద్ టీపీటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం విద్యారంగ సమస్యలపై రూపొందించిన విద్యారంగ పీపుల్స్ మేనిఫెస్టోను విడుదల చేశారు. షైన శ్రీనివాస్, చుంచు శ్రీశైలం, బాస్కర్, రమేష్, విష్ణువర్దన్, ఉపేందర్‌రెడ్డి, ఉపేందర్, విద్యాసాగర్, గోవర్దన్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎంపీపీగా బాధ్యతలను స్వీకరిస్తున్న కల్పన రాజుయాదవ్

ఎంపీపీగా కల్పన బాధ్యతల స్వీకరణ

పెద్దవంగర, ఏప్రిల్ 16 : రాష్ట్రప్రభుత్వ ఆమోదం మేరకు పెద్దవంగర ఎంపీపీగా వైస్ ఎంపీపీ బొమ్మరబోయిన కల్పనరాజుయాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతనెల మార్చి 23న ఎంపీపీ ఈదురు రాజేశ్వరిపై అవిశ్వాసం నెగ్గడంతో ఎంపీపీ పదవి నుంచి తొలగించారు. దీంతో ఖాళీ అయిన ఎంపీపీ పదవిని వైస్ ఎంపీపీ కల్పన రాజుయాదవ్‌కు ఎంపీపీగా బాధ్యతలు అప్పగించారు.

'ఎండ ముదరక ముందే ఇంటికి తిరిగి రావాలి'

దంతాలపల్లి, ఏప్రిల్16 : జాతీయ ఉపాధి హామీ కూలీలు ఎండ ముదరక ముందే పనులు ముగించుకుని ఇంటికి రావాలని టెక్నికల్ అసిస్టెంట్ రవి కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రామవరం, ఆగపేట, తూర్పుతండాలో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలకు సూచనలు చేశారు. ప్రభుత్వం దినసరి రోజు వారీగా రూ.300 చెల్లించనుందన్నారు.అందుకు గాను కొలత ప్రకారం పనులు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమతశ్రీ, ఫీల్డ్అసిస్టెంట్ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాకర్లు పట్టివేత

పెద్దవంగర, ఏప్రిల్ 16 : అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై బానోతు మహేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గొట్టిపర్తికి చెందిన పాల నరేశ్, షేక్ అక్బర్ అనే వ్యక్తులు గ్రామ శివారులోని బయన్న వాగు నుంచి ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా పెద్దవంగర మండలంలోని బొమ్మకల్లు శివారు ఖండ్యతండాకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న క్రమంలో పట్టుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ఆస్పత్రిలో సేవలను మెరుగుపరుస్తాం'

డోర్నకల్, ఏప్రిల్ 16 : డోర్నకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సేవలను విస్తృతం చేయనున్నట్లు జిల్లా వైద్యాధికారిణి కళావతిబాయి తెలిపారు. డోర్నకల్ పీహెచ్‌సీని మంగళవారం ఆమె అకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యులతో మాట్లాడారు. అనంతరం ఆస్పత్రిలోని వివిధ వార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో మరికొన్ని మౌళిక సదుపాయాలు, 30 పడకల ఆస్పత్రిగా ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆమె వెంట వైద్యులు సాద్విజ, సీహెచ్‌వో వీరబాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్ సమన్వయకర్తల నియామకం

రాంనగర్, ఏప్రిల్ 16 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వరంగల్ లోక్‌సభకు సంబంధించి నియోజకవర్గ సమన్వయకర్తలను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం నియమించారు. పరకాల నియోజకవర్గానికి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, పాలకుర్తికి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మెట్టు శ్రీనివాస్, స్టేషన్ ఘనపూర్‌కు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వరంగల్ వెస్ట్‌కు మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, సంగంరెడ్డి సుందర్‌రాజ్, వరంగల్ ఈస్ట్‌కు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వర్ధన్నపేటకు కె.వాసుదేవరెడ్డి, సాంబారి సమ్మారావుకు, భూపాలపల్లినియోజకవర్గానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నియామకమయ్యారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 16 : మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఓగుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం. మంగళవారం తెల్లవారుజామున మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని కిలోమీటర్ రాయి 439/16 దిగువ రైలుపట్టాల మధ్య గుర్తుతెలియని రైలు కిందగుర్తు తెలియని వృద్ధుడు అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు రైలునుంచి జారపడి మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఖమ్మం అన్నం ఫౌండేషన్ సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.